క్లుప్తంగా

ఆలయానికి స్టీల్ గేటు అందజేత



దాతలను సత్కరిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: స్థానిక ముత్యాలమ్మ ఆలయ సింహద్వారానికి రూ.30 వేలు విలువైన స్టీలు రైలింగ్ గేటును దాత చోడవరపు రంగా, జ్యోతి దంపతులు ఆలయ కమిటీ సభ్యులకు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా దాతలను దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. ఆలయ శాశ్వత కమిటీ చైర్మన్ రాజాన సత్యనారాయణ మాట్లాడుతూ గేట్లతో పాటు గతంలో సహస్ర దీపాలంకరణ సేవకు సంబంధించి స్టాండ్‌ను సైతం అందించారని తెలిపారు.

అన్నప్రసాద వితరణ



అన్నప్రసాదం కోసం బారులు తీరిన భక్తులు

జంగారెడ్డిగూడెం: స్థానిక అశ్వారావుపేట రోడ్డులో కొలువైన శ్రీ సుందర బాల సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం వద్ద మంగళవారం అన్నప్రసాద వితరణ చేశారు. తొలుత స్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు. స్వామి వారికి నైవేద్యంగా సమర్పించిన అన్నప్రసాదాన్ని సుమారు రెండు వేల మంది భక్తులు స్వీకరించినట్టు వితరణ కమిటీ అధ్యక్షుడు గండికోట బాబి తెలిపారు. ఈ సందర్భంగా దాతలు ఆర్టీసీ ఉద్యోగి ధారావతు గోపి, దుర్గమ్మ దంపతులు, బంగారం వ్యాపారులు తిరువీధి హనుమంత్ దంపతులు, సుమంగళి జ్యూయలర్స్ మాడా ప్రసాద్ దంపతులు, కర్రి శ్రీరామరెడ్డి దంపతులను సత్కరించారు.

ఆలయానికి విరాళం



విరాళం చెక్కు అందిస్తున్న దాతలు

కొయ్యలగూడెం: స్థానిక తాడేపల్లిగూడెం రోడ్డులో నిర్మిస్తోన్న శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయానికి మంగళవారం తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలం చిన్నాయిగూడెంకు చెందిన యలమాటి వెంకట రాయుడు, రమాదేవి దంపతులు రూ.1,01,116 విరాళం చెక్కురూపంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు తాడికొండ మురళీ కృష్ణకు అందజేశారు. దాతలను అర్చకుడు అనిపెద్ది నరసింహశర్మమూర్తి ఆధ్వర్యంలో సత్కరించారు.

పారిజాతగిరి ఆలయ ఈఓగా శ్రీనివాస్



బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాస్

జంగారెడ్డిగూడెం: గోకుల తిరుమల పారిజాతగిరి ఆలయ ఈఓగా కలగర శ్రీనివాస్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఆయన ఇక్కడికి వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ ఈఓగా మానికల రాంబాబు పనిచేశారు.

ధర్మాజీగూడెం వెటర్నరీ ఏడీగా లింగయ్య

లింగపాలెం: ధర్మాజీగూడెం పశువైద్యశాఖ ఏడీ ఏగా జె.లింగయ్య బాధ్యతలు చేపట్టారు. ఆయన చింతలపూడి నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా లింగయ్య మాట్లాడుతూ పాడి పరిశ్రమకు చేయూత ఇచ్చేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను పాడి రైతులకు అందేలా కృషి చేస్తానని చెప్పారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ పశువులు, గొర్రెలు, మేకలకు సంబంధించి సకాలంలో వైద్య సేవలు అందిస్తానని తెలిపారు.

వికసిత భారత సంకల్ప సభ



సమావేశంలో మాట్లాడుతున్న తపన చౌదరి

కొయ్యలగూడెం: వికసిత భారత సంకల్ప సభ మంగళవారం రేపల్లెవాడ రోటరీ ఫంక్షన్ హాల్‌లో బీజేపీ మండల అధ్యక్షుడు బొలిశెట్టి వాసు ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా తపన ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు గారపాటి సీతారామాంజనేయ చౌదరి పాల్గొని మాట్లాడారు. మోదీ, షా ద్వయం నేతృత్వంలో అగ్రదేశాలకు దీటుగా భారతావని ఎదిగిందన్నారు. బీజేపీ ప్రభుత్వం 11 సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా బీజేపీ శ్రేణులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు బొల్లిన నిర్మల కిషోర్, పార్టీ నాయకులు కట్టా సత్యనారాయణ, బొమ్మ బాబు, మద్దిబోయిన శ్రీనివాస్, బాలం నరేష్, ఆరేటి ఏసుబాబు, తగరం కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఏడాది పాలనలో ప్రజలకు ఒరిగింది శూన్యం

మాజీ మంత్రి తానేటి వనిత



కొమ్మరలో జగన్ అంటే నమ్మకం, చంద్రబాబు అంటే మోసం పుస్తకాన్ని విడుదల చేసిన వనిత



బుట్టాయగూడెంలో పోస్టర్ విడుదల చేస్తున్న మాజీ ఎమ్మెల్యే బాలరాజు, తదితరులు

ద్వారకాతిరుమల: కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో తప్పుడు కేసులు, మోసాలు, అవినీతి, అబద్ధాలు, దాడులు, దోపిడీలు తప్ప ప్రజలకు చేసిన మేలు ఏమీ లేదని మాజీ హోం మంత్రి, వైఎస్సార్ సీపీ గోపాలపురం నియోజకవర్గ ఇన్‌చార్జి తానేటి వనిత అన్నారు. కూటమి ప్రభుత్వ అప్రజాస్వామిక పరిపాలనపై వైఎస్సార్ సీపీ ముద్రించిన జగన్ అంటే నమ్మకం.. చంద్రబాబు అంటే మోసం అనే పుస్తకాలను మంగళవారం ఆమె ద్వారకాతిరుమల మండలం కొమ్మర గ్రామంలో పార్టీ నేత తాండ్ర రమేష్ ఇంటి వద్ద విడుదల చేశారు. ఈ సందర్భంగా వనిత మాట్లాడుతూ ప్రస్తుత కూటమి ఏడాది పాలన, గత వైఎస్సార్ సీపీ పరిపాలనలో సంక్షేమ పథకాలు అమలు, అభివృద్ధి, సంస్కరణలను బేరీజు వేస్తూ పుస్తకాన్ని ముద్రించినట్టు చెప్పారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ వైఎస్సార్ సీపీ నేతలను టార్గెట్ చేసి, అక్రమ అరెస్టులకు పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. వైఎస్సార్ సీపీ నిలదీతలు కారణంగానే తల్లికి వందనం పథకాన్ని షరతులతో అమలు చేశారని తెలిపారు. నిరుద్యోగ భృతి, అన్నదాత సుఖీభవ సాయం ఊసేలేదన్నారు. 19 నుంచి 50 ఏళ్ల వయస్సున్న ప్రతి మహిళకూ నెలకు రూ.1,500 చొప్పున ఏడాదికి రూ.18 వేలు ఇస్తామన్న పథకం, ఉచిత బస్సు ప్రయాణం అమలుకు నోచుకోలేదని విమర్శించారు. తల్లికి వందనం పేరుతో రూ.10 వేల కోట్లు ఇచ్చామని చెబుతున్న ప్రభుత్వ పెద్దలు ఈ ఏడాది రూ.15,500 కోట్ల విద్యుత్ ఛార్జీల భారాన్ని ప్రజల నెత్తిన మోపిందని విమర్శించారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, పోల్కంపల్లి అనీల్, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు దాకారపు బంగారమ్మ, యాచమనేని నాగేశ్వరరావు, మానుకొండ కన్నయ్య, బసివిరెడ్డి వెంకట్రామయ్య, పార్టీ మండల మహిళా అధ్యక్షురాలు మల్లెపూడి నాగమణి, చెలికాని బుల్లియ్య, దాసరి రాంబాబు, షేక్ భాషా, పెద్దిరెడ్డి నాగేశ్వరరావు, మానుకొండ సుబ్బారావు, చెలికాని శ్రీనుబాబు, తాండ్ర గోపాలరావు, తాండ్ర సత్యంబాబు, దాసరి ఏసురత్నం, మానుకొండ ప్రసాద్, నాగేశ్వరరావు, పద్మారావు, వెంకట్రావు, భోగరాజు సాయికృష్ణ, తాండ్ర ఫణికుమార్ (చిన్ని), కొడుదుల ప్రసాద్ తదితరులున్నారు.

అంతా మోసం

బుట్టాయగూడెం: గత ప్రభుత్వ కాలంలో మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అంటే ఒక నమ్మకమని ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో సీఎం చంద్రబాబు అంటే అంతా మోసమే కనిపిస్తుందని మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. బుట్టాయగూడెంలో ఆరేటి కాంప్లెక్స్ వద్ద మంగళవారం జగన్ అంటే నమ్మకం.. చంద్రబాబు అంటే మోసమనే కరపత్రాన్ని ఆయన విడుదల చేసి మాట్లాడారు. కూటమి ప్రభుత్వంలో అశాంతి, అరాచకం, ఆటవికం, రాజ్యాంగ ఉల్లంఘన, మహిళలు, బాలికలపై అఘాయిత్యాలు, వేధింపులు, అన్యాయాలు, అబద్ధాలు, ఏకపక్ష పాలన కొనసాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజల కోసం పనిచేస్తే.. నేడు కూటమి ప్రభుత్వం నాయకుల కోసమే పనిచేస్తోందని ఆరోపించారు. కూటమి ప్రభుత్వ ఏడాది పాలన అంతా మోసాలేనని వివరించారు. వీధికొక బెల్టుషాపు, ఎక్కడికక్కడ ఇసుక, మట్టి దోపిడీ విచ్చలవిడిగా సాగిస్తున్నారని తెలిపారు. కూటమి పాలనను ప్రశ్నిస్తే నాయకులు, కార్యకర్తలపై దౌర్జన్యాలు చేయడంతో పాటు అక్రమ కేసులు కూడా బనాయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అవినీతిలో పూర్తిగా కూరుకుపోయిందన్నారు. ఇలాంటి ప్రభుత్వాన్ని ఎన్నుకున్నందుకు ప్రజలే బాధపడుతున్నారని తెలిపారు. చంద్రబాబు తన తప్పులు కప్పిపుచ్చుకోవడానికి ఏడాది పొడవునా మాజీ సీఎం జగన్‌ను తిట్టడమే పనిగా పెట్టుకున్నారని వివరించారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టే విధంగా వైఎస్సార్ సీపీ శ్రేణులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ అల్లూరి రత్నాజీరావు, సీనియర్ నాయకులు ఆరేటి సత్యనారాయణ, జిల్లా వాణిజ్య విభాగం నాయకులు తాళ్లూరి ప్రసాద్, సర్పంచ్‌లు బన్నే బుచ్చిరాజు, మాల్చి వెంకన్నబాబు, ఉయికే బొజ్జి, నాయకులు యాండ్ర రవి, బాబూరావు, బద్రి, తదితరులు పాల్గొన్నారు.

జగన్ అంటే నమ్మకం.. చంద్రబాబు అంటేనే మోసం



లింగపాలెం : ధర్మాజీగూడెంలో పుస్తకాన్ని విడుదల చేసిన సమన్వయకర్త విజయరాజు, నేతలు

లింగపాలెం: వైఎస్సార్ సీపీ అధ్యక్షులు జగన్‌మోహన్‌రెడ్డి అంటే నమ్మకం, టీడీపీ అధినేత చంద్రబాబు అంటే మోసం, ద్రోహం అని, కూటమి ఏడాది పాలనలో ప్రజలకు తెలిసిందని వైఎస్సార్ సీపీ చింతలపూడి నియోజకవర్గ సమన్వయకర్త కంభం విజయరాజు అన్నారు. మంగళవారం మండలంలోని ధర్మాజీగూడెం గ్రామంలో జగన్ అంటే నమ్మకం, చంద్రబాబు అంటే మోసం అనే పుస్తకాన్ని వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా విజయరాజు మాట్లాడుతూ చంద్రబాబు ఎన్నికల ముందు సూపర్ సిక్స్ అనే హామీలు ఇచ్చి వెన్నుపోటు పొడిచారన్న విషయాన్ని ప్రజలు గ్రహిస్తున్నారని చెప్పారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఆరు నెలల్లోనే ఇచ్చిన హామీలను నెరవేర్చిన ఘనత మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. జగన్ మ్యానిఫెస్టోను పవిత్ర గ్రంథం లాగా భావించి ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చారని గుర్తుచేశారు. ఒక్క హామీ కూడా నెరవేర్చకుండా ప్రజలను మోసం చేసే చరిత్ర చంద్రబాబుదని విమర్శించారు. తల్లికి వందనం పథకాన్ని కొందరికే పరిమితం చేశారని, 30 లక్షల మంది పిల్లలకు అన్యాయం చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో అరాచకాలు, దుర్మార్గాలు పెరిగిపోయాయని, శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని ఆందోళన వ్యక్తం చేశారు. రెడ్‌బుక్ రాజ్యాంగం పేరుతో కక్షసాధింపులకు పాల్పడుతున్నారని, తీవ్ర అధికార దుర్వినియోగం చేస్తున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం తన వైఫల్యాలను కప్పి పుచ్చుకోవడానికి డైవర్షన్ రాజకీయాలు చేస్తుందని విమర్శించారు. రాష్ట్ర రాజధాని నుంచి గ్రామ స్థాయి వరకు కక్షసాధింపు రాజకీయాలు చేస్తున్నారని తెలిపారు. ఎన్ని అరాచకాలు సృష్టించినా ఎంత భయాందోళనలకు గురిచేసినా కూటమి వైఫల్యాలు ప్రశ్నించడంలో వైఎస్సార్ సీపీ నేతలు వెనుకడుగు వేయరని విజయరాజు స్పష్టం చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు కఠారి మోహన్, ధర్మాజీగూడెం మాజీ సొసైటీ అధ్యక్షుడు ఉప్పలపాటి వరప్రసాద్, వైఎస్సార్ సీపీ మండల ముఖ్య నేత మునునూరి వెంకటేశ్వరరావు, పార్టీ సచివాలయ కన్వీనర్ అన్నపనేని శాంతారావు, నాయకులు రావి కొండయ్య, చీదరాల ప్రసాద్, మేకల రాజు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించాలి



కామవరపుకోట : ఆడమిల్లిలో రైతులకు సూచనలిస్తున్న ఏవో ముత్యాలరావు



చింతలపూడి : రాఘవాపురంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో

కామవరపుకోట: వ్యవసాయంలో నూతన సాంకేతిక పద్ధతులు అవలంభించి తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించాలని మండల వ్యవసాయ శాఖ అధికారి డి.ముత్యాలరావు రైతులకు సూచించారు. మంగళవారం కామవరపుకోట మండలం ఆడమిల్లి, అంకాలంపాడు గ్రామాలలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఏఓ మాట్లాడారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌లో వ్యవసాయ ప్రధాన పంటగా వరిలో ఎంటీయూ 1061, ఎంటీయూ 1064, బీపీటీ 5204 వంటి రకాలను సాగు చేయాలన్నారు. రైతులు అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు వరలక్ష్మి, గంగాధరరావు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వరి నారుమళ్లలో జాగ్రత్తలు తప్పనిసరి

చింతలపూడి : వరి నారుమళ్లలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి మురళీ కృష్ణ రైతులకు సూచించారు. మంగళవారం చింతలపూడి మండలం రాఘవపురం, గణిజెర్ల గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మురళీకృష్ణ మాట్లాడుతూ ఈ ఖరీఫ్‌లో మేలైన విత్తనాలను ఎంచుకోవాలన్నారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో బీజామృతంతో వరి విత్తనాలను శుద్ధి చేసుకోవాలని, అధిక దిగుబడుల కోసం ఎక్కువ రసాయన ఎరువులు, పురుగుమందులు వాడరాదని సూచించారు. ప్రకృతి వ్యవసాయం చేయడం వల్ల భూమి సారవంతంగా తయారవుతుందన్నారు. ఉద్యాన శాఖ అధికారి ఫర్హిన్ మాట్లాడుతూ కోకో, కొబ్బరి రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అన్నదాత సుఖీభవ పథకం పొందేందుకు రైతులు ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ శివకుమార్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చింతలపూడి : స్థానిక టౌన్ ఫీడర్ పరిధిలోని వెంకట్రామబాగ్, నాగిరెడ్డిగూడెం ఫీడర్ పరిధిలోని సుప్రీంపేట ఏరియాలలో బుధవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా దఫ దఫాలుగా ఇవ్వనున్నట్టు ఈఈ పీర్ అహ్మద్ ఖాన్ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

జంగారెడ్డిగూడెం సీఐగా సుభాష్



ఎంవీ సుభాష్, సీఐ

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం సీఐగా ఎంవీ సుభాష్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన నిడమర్రు సర్కిల్ నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ పని చేసిన సీఐ వి.కృష్ణబాబును వీఆర్‌లో ఉంచారు. కాగా సీఐ సుభాష్ మాట్లాడుతూ పట్టణంలో గంజాయి విక్రయాలు, వినియోగం, ట్రాఫిక్ సమస్యపై దృష్టిసారిస్తామన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజాసహకారంతో సమస్యలు పరిష్కరిస్తామన్నారు. సోషల్ మీడియా గ్రూప్‌ల్లో వార్తలు, ఘటనలు ఖచ్చితత్వాన్ని నిర్ధారించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా సీఐ సుభాష్‌ను స్థానిక పోలీస్ స్టేషన్ సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు.

లింగపాలెం ఏఓగా ప్రదీప్ కుమార్



లింగపాలెం ఏవో ప్రదీప్‌కుమార్

లింగపాలెం: లింగపాలెం మండల పరిధిలో ఉన్న రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రత్యేక చొరవ చూపుతానని ఏఓ వి.ప్రదీప్ కుమార్ అన్నారు. ఆయన పెదపాడు నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమన్వయంతో రైతులకు మెరుగైన సేవలు అందిస్తామన్నారు. సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి రైతుకూ అందించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆధునిక వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పిస్తామని తెలిపారు.

నేడు బౌద్ధారామంలో యోగాంధ్ర



ధాత్రిరెడ్డి, జేసీ

ఏలూరు(మెట్రో): యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా పర్యాటకశాఖ ఆధ్వర్యంలో జూన్ 18న కామవరపుకోట మండలం జీలకర్రగూడెం, గుంటుపల్లి బౌద్ధరామాల వద్ద ఉదయం 6.30 నుంచి ఉదయం 8 గంటల వరకు యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించనున్నట్టు జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి తెలిపారు. మంగళవారం యోగాంధ్ర కార్యక్రమానికి సంబంధించి వివిధ అంశాలపై సంబంధిత శాఖల అధికారులు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు తదితరులతో జేసీ టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈనెల 18న గుంటుపల్లి బౌద్ధరామంలో నిర్వహించే యోగాంధ్రను విజయవంతం చేయాలని కోరారు. రానున్న మూడు రోజులపాటు జిల్లాలోని అన్ని పాఠశాలల్లో యోగాభ్యాసన కార్యక్రమాలు నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని డీఈఓను ఆదేశించారు. ఈనెల 21న అంతర్జాతీయ యోగాదినోత్సవం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా గ్రామ, వార్డు, సచివాలయాల పరిధిలో గుర్తించిన 5,053 వేదికల్లో యోగాభ్యాసన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. యోగాంధ్రలో భాగస్వామి అయ్యేందుకు జిల్లాలో ఇంతవరకు 8,60,072 మంది రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని జేసీ వివరించారు.

ప్రభుత్వ ఐటీఐలో స్వల్పకాలిక శిక్షణ

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు నైపుణ్యాలను అభివృద్ధి చేసి మెరుగైన అవకాశాలను కల్పించేందుకు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ స్కిల్ హబ్ ద్వారా స్థానిక ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఫిట్టర్ ఫ్యాబ్రికేషన్, అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్ కోర్సులకు స్వల్పకాలిక శిక్షణ ఇవ్వనున్నట్టు ప్రభుత్వ ఐటీఐ ప్రధానాధికారి డి.భూషణం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణకు పదో తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ, ఐటీఐ పూర్తి చేసి ఖాళీగా ఉన్న 15 నుంచి 30 సంవత్సరాల్లోపు వయసు ఉన్న అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. శిక్షణ అనంతరం అర్హులకు ప్రైవేట్ సంస్థల్లో అవకాశాలు కల్పిస్తామని, పూర్తి వివరాలకు సెల్ నెంబర్ 8978524022 సంప్రదించవచ్చని తెలిపారు.

మద్ది అంజన్నకు పూజలు



ఆంజనేయస్వామి దర్శనానికి బారులు తీరిన భక్తులు

జంగారెడ్డిగూడెం: మండలంలోని గుర్వాయిగూడెం మద్ది క్షేత్రంలో మంగళవారం సందర్భంగా స్వామి వారిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. ఉదయం నుంచే అంజన్నకు ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారికి ప్రభాతసేవ, నిత్యార్చన పూజలు నిర్వహించారు. ఆలయానికి మంగళవారం మధ్యాహ్నం వరకు రూ.2,15,593 ఆదాయం సమకూరినట్టు ఈఓ ఆర్‌వీ చందన తెలిపారు. 1500 మంది అన్నప్రసాదం స్వీకరించారని పేర్కొన్నారు.

సుబ్రహ్మణ్యుడికి పూజలు



సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

జంగారెడ్డిగూడెం మండలం గుర్వాయిగూడెం అయ్యప్పస్వామి ఉపాలయమైన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి ఆలయంలో మంగళవారం విశేష పూజలు చేశారు. సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు.

మాజీ మంత్రి వనిత పరామర్శలు



శ్రీరాములును పరామర్శిస్తున్న మాజీ మంత్రి వనిత, తదితరులు

ద్వారకాతిరుమల: మండలంలో అనారోగ్యంతో బాధపడుతున్న పలువురు వైఎస్సార్ సీపీ నాయకులను మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ గోపాలపురం నియోజకవర్గ ఇన్‌చార్జి తానేటి వనిత మంగళవారం పరామర్శించారు. ముందుగా ఆమె రాళ్లకుంటలో పార్టీ నాయకుడు గుర్రాల లక్ష్మణ్ ఇంటికి వెళ్లి అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన తండ్రి నాగేశ్వరరావును, అనంతరం వెంకటకృష్ణాపురంలో అనారోగ్యంతో బాధపడుతున్న పార్టీ నేత యలమర్తి గాంధిని, ఇటీవల గుండె సంబంధిత చికిత్స చేయించుకున్న సర్నాల శ్రీరాములును పరామర్శించారు. ఆమె వెంట పార్టీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, పాకలపాటి త్యాగ భీమేశ్వరరావు, గోపా నాగేశ్వరరావు, మానుకొండ సుబ్బారావు, మల్లెపూడి నాగమణి, నరం నారాయణరావు, బుసనబోయిన నాగరాజు, గంటా విఘ్నేశ్వరరావు, యలమర్తి భాస్కరరావు, యలమర్తి దుర్గాదేవి, ములకాల మంగరాజు, సర్నాల శ్రీనివాసరావు, ములకాల వెంకటేశ్వరరావు, నేతల పండు, తంబి, గెడ్డం నాగరాజు, సర్నాల సల్లాలయ్య, బి.స్వామి, సాధనాల రాజా, వామిశెట్టి ఆంజనేయులు, బుసనబోయిన వంశీ తదితరులున్నారు.

అక్రమ కట్టడాలపై ఫిర్యాదు



వివాదాస్పద స్థలంలో పూడుకుపోయిన డ్రెయినేజీ

ద్వారకాతిరుమల: భీమడోలులోని స్టేట్ బ్యాంకు ఎదురుగా ద్వారకాతిరుమల మండలం ద్వారకానగర్ పరిధిలో రోడ్డు పక్కన ఉన్న డ్రెయినేజీని ఓ వ్యక్తి పూడ్చి వేసి, అక్కడ నిర్మాణాలు చేపట్టడం వివాదాస్పదమైంది. స్థానికుల కథనం ప్రకారం. భీమడోలు జంక్షన్ మీదుగా పారే వర్షపు నీరు, అలాగే ఆ ప్రాంతంలోని ఇళ్లలోంచి వచ్చే వాడకం నీరు, స్టేట్ బ్యాంకు వెనుక ఉన్న కాలనీ నుంచి వచ్చే వాడకం, వర్షపు నీరు ఈ డ్రెయినేజీలోనే కలుస్తాయి. ఆ నీరంతా దిగువ ప్రాంతానికి పారుతుంది. అయితే ఒక వ్యక్తి డ్రెయినేజీని పూడ్చి వేసి అక్రమ నిర్మాణాలు చేస్తున్నాడని, దీంతో వాడకం, వర్షపు నీరు దిగువ ప్రాంతానికి పారే వీలు లేకుండా పోతుందని భీమడోలుకు చెందిన ఎంపీటీసీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ విభాగం కార్యదర్శి ముల్లగేరి జాన్సన్ తెలిపారు. వెంటనే ఈ అక్రమ కట్టడాలను నిలుపుదల చేయాలని స్థానిక పంచాయతీ కార్యదర్శికి ఫోన్‌లో ఫిర్యాదు చేసినట్టు చెప్పారు. దీనిపై పంచాయితీ కార్యదర్శి బాలామణిని వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆమె అందుబాటులోకి రాలేదు.

ప్రభుత్వ ఐటీఐలో స్వల్పకాలిక శిక్షణ

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు నైపుణ్యాలను అభివృద్ధి చేసి మెరుగైన అవకాశాలను కల్పించేందుకు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ స్కిల్ హబ్ ద్వారా స్థానిక ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఫిట్టర్ ఫ్యాబ్రికేషన్, అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్ కోర్సులకు స్వల్పకాలిక శిక్షణ ఇవ్వనున్నట్టు ప్రభుత్వ ఐటీఐ ప్రధానాధికారి డి.భూషణం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నైపుణ్యాల అభివృద్ధి శిక్షణకు పదో తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ, ఐటీఐ పూర్తి చేసి ఖాళీగా ఉన్న 15 నుంచి 30 సంవత్సరాల్లోపు వయసు ఉన్న అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. శిక్షణ పూర్తిచేసిన అనంతరం అర్హులకు ప్రైవేట్ సంస్థల్లో అవకాశాలు కల్పిస్తామని, ఆసక్తి గల అభ్యర్థులు పూర్తి వివరాలకు సెల్ నెంబర్ 8978524022లో సంప్రదించవచ్చని తెలిపారు.

పాలస్తీనాపై మారణకాండను నిలిపివేయాలి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): పాలస్తీనాపై ఇజ్రాయిల్ చేస్తోన్న మారణకాండను తక్షణమే నిలుపుదల చేయాలని, అమెరికా సామ్రాజ్యవాదం నశించాలని ప్రపంచ శాంతిని కాపాడాలని కోరుతూ మంగళవారం ఏలూరులో వామపక్ష పార్టీలు పాలస్తీనా సంఘీభావ దినాన్ని పాటించాయి. రాష్ట్ర స్థాయి వామపక్ష పార్టీలు ఇచ్చిన పిలుపులో భాగంగా స్థానిక పాత బస్టాండ్ అంబేడ్కర్ విగ్రహం వద్ద సీపీఐ, సీపీఎం, సీపీఐ ఎంఎల్ (న్యూ డెమోక్రసీ), ఎంసీపీఐ (యూ) పార్టీల ఆధ్వర్యంలో నాయకులు కార్యకర్తలు ఇజ్రాయిల్ వ్యతిరేకంగా పాలస్తీనాకు సంఘీభావంగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆర్ లింగరాజు, సీపీఐ ఎంఎల్ (న్యూ డెమోక్రసీ) జిల్లా నాయకులు కేవీ రమణ, ఎంసీపీఐ (యూ) జిల్లా కార్యదర్శి ఎస్ నాగరాజు మాట్లాడుతూ రెండేళ్లుగా పాలస్తీనాపై అమెరికా ప్రోత్సాహంతో ఇజ్రాయిల్ చేస్తోన్న దాడుల వల్ల సుమారు 60 వేల మంది మరణించడం బాధాకరమన్నారు. ఇరాక్‌పై కూడా ఇజ్రాయిల్ దాడులకు తెగబడ్డదని, అమెరికా తమ ఆయుధాలను విక్రయించుకునే పద్ధతిలోనే ఈ దాడులను ప్రోత్సహిస్తోందని ఆరోపించారు. ప్రపంచ శాంతిని కోరుకునే భారత ప్రభుత్వం ఇజ్రాయిల్ చర్యను ఖండించకుండా మౌనంగా ఉండటాన్ని నాయకులు ఖండించారు.